క్లుప్తంగా

అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు సన్మానం



గోపాలకృష్ణకు జ్ఞాపిక అందిస్తున్న తోటి ప్రొఫెసర్లు, విద్యార్థులు, సిబ్బంది

అశ్వారావుపేటరూరల్: బదిలీపై వెళ్తున్న వ్యవసాయ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్‌ను మంగళవారం కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది ఘనంగా సన్మానించారు. స్థానిక వ్యవసాయ కళాశాలలో సుదీర్ఘకాలంగా అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహించిన డాక్టర్ కె.గోపాలకృష్ణకు రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ యూనివర్సిటీ ఉపకులపతికి టెక్నికల్ అడ్వైజర్‌గా బదిలీపై వెళ్తున్న డాక్టర్ జి.గోపాలకృష్ణ మూర్తికి శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. జ్ఞాపికలు, పుష్పగుచ్ఛాలను అందించి వీడ్కోలు పలికారు. అనంతరం జరిగిన సమావేశంలో కళాశాల డీన్ డాక్టర్ హేమంత్‌కుమార్ మాట్లాడుతూ.. ఇదే కళాశాలలో అగ్రికల్చర్ బీఎస్సీ పూర్తి చేసి, ఇదే కళాశాలకు 16 ఏళ్ల క్రితం అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉద్యోగం సాధించారని గుర్తు చేశారు. కళాశాల అభివృద్ధి, విద్యార్థుల ఉన్నత ప్రగతికి కీలక పాత్ర పోషించారని ప్రశంసించారు. కార్యక్రమంలో కళాశాల ప్రొఫెసర్లు, బోధనేతర, టైం స్కేల్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమణలు తొలగించాలని వినతి

అశ్వారావుపేటరూరల్: ప్రధాన రహదారికి ఇరువైపులా అనుమతులు లేకుండా నిర్మించిన అక్రమ నిర్మాణాలను తొలగించాలని టీడీపీ మండల అధ్యక్షుడు నార్లపాటి శ్రీను డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని వినాయకపురం గ్రామ పంచాయతీ కార్యాలయంలో గుమ్మాస్తా వేల్పుల ముత్తారావుకు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినాయకపురం కేంద్రంలోని ప్రధాన రహదారిని అక్రమించి నిర్మించిన భవనాలను కూల్చివేయాలని కోరారు.

విద్యార్థులు పరిశుభ్రత పాటించాలి

గుండాల: విద్యార్థులు పరిశుభ్రత పాటిస్తే ఎటువంటి జబ్బులు దరిచేరవని ఆళ్లపల్లి ప్రభుత్వ వైద్యాధికారి కేపీ సంఘమిత్ర సూచించారు. ఆళ్లపల్లి మండలంలోని జాకారం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. సలహాలు, సూచనలు చేశారు. ప్రూటేరియన్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షేక్ మహమూద్ పాషా వైద్య అధికారికి శాలువాతో సన్మానం చేశారు. కార్యక్రమంలో ఆశ వర్కర్స్ పాయం సత్యవతి, పాయం రాంబాయి, బొమ్మల రమాదేవి, గోగ్గెల రాంబాయి, పాయం సావిత్రి, హెల్త్ సూపర్ వైజర్ శ్రీధర్ బాబు, విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

మెమోరీ చాంపియన్‌షిప్‌లో బంగారు పతకం



విద్యార్థినిని అభినందిస్తున్న పాఠశాల ప్రిన్సిపల్ యుగంధర్

మణుగూరురూరల్: ఇటీవల హైద్రాబాద్‌లో జరిగిన నేషనల్ మెమోరీ చాంపియన్ షిప్‌లో మండలంలోని గుట్టమల్లారంలోని శ్రీచైతన్య పాఠశాలకు చెందిన తరాల శ్రీనిధి అత్యుత్తమ ప్రతిభ కనబర్చి బంగారు పతాకాన్ని సాధించింది. మంగళవారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ప్రిన్సిపల్ యుగంధర్ మాట్లాడుతూ.. జాతీయ స్థాయిలో జరిగిన పోటీలో తమ పాఠశాల విద్యార్థిని శ్రీనిధి సత్తా చాటి బంగారు పతాకాన్ని కైవసం చేసుకోవడం గర్వకారణమన్నారు. అనంతరం విద్యార్థినిని ప్రిన్సిపల్ యుగంధర్, పాఠశాల ఏజీఎం జయప్రకాష్, కో ఆర్డినేటర్ వెంకట్‌లు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల డీన్ భాస్కర్‌రెడ్డి, సీ బ్యాచ్ ఇన్‌చార్జ్ కొమరయ్య, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పూజలు

దమ్మపేట: మండలంలోని ముష్టిబండ గ్రామ శివారులో శ్రీరంగనాథస్వామి ఆశ్రమం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన శ్రీషిరిడీ సాయినాథుని ఆలయంలో సాయిబాబాను మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు మంగళవారం దర్శించుకున్నారు. బాబాకు స్వయంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించి, తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకురాలు కూకలకుంట శ్రీదేవి, బీఆర్ఎస్ నాయకులు దారా యుగంధర్, పసుమర్తి రాంభద్రం పాల్గొన్నారు.

గిరిజనుల గోడు పట్టదా..?

- పాములేరుపై నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి
- డైవర్షన్ రోడ్డు లేక స్థానికుల అవస్థలు
- సత్వరమే ఏర్పాటు చేయాలంటూ రాస్తారోకో



ములకలపల్లి సెంటర్‌లో రాస్తారోకో నిర్వహిస్తున్న గిరిజనులు (ఫైల్)



కోతకు గురైన డైవర్షన్ రోడ్డు, దానిపై నిర్మించిన ఇనుప వంతెన

ములకలపల్లి: పాములేరు వాగుపై నూతన బ్రిడ్జి నిర్మించేందుకు శిథిలావస్థకు చేరిన వంతెన కూల్చేశారు. ప్రత్యామ్యాయంగా డైవర్షన్ రోడ్డు వేసినా, పలుమార్లు కొట్టుకుపోవడంతో అలానే వదిలేశారు. తాత్కాలికంగా ఐరన్ పాత్‌వే వేసి, కాలం వెళ్లదీస్తున్నారు. ఇలా ఎంతకాలం ఉండాలని, మరలా డైవర్షన్ రోడ్డు పునరుద్ధరించాలని గిరిజన గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ములకలపల్లి శివారులోని వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి రూ.ఐదున్నర కోట్లు మంజూరు కాగా, గత అక్టోబర్‌లో అప్పటి ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు భూమిపూజ చేసి లాంఛనంగా పనులను ప్రారంభించారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పనులు నిలిచిపోగా ఏప్రిల్ మాసంలో మరలా మొదలుపెట్టారు, పాత వంతెనను తొలగించి, వాగుపై మోరీలు వేసి, డైవర్షన్ రోడ్డు ఏర్పాటు చేశారు. విద్యుత్ స్తంభాలు మార్చే విషయంలో జాప్యం కావడంతో వంతెన నిర్మాణం ఆలస్యమైంది. జూన్, జూలై నెలల్లో కురిసిన భారీ వర్షాలకు తాత్కాలికంగా నిర్మించిన డైవర్షన్ రోడ్డు కోతకు గురైంది. పలుమార్లు పునరుద్ధరించినా, వాగు ప్రవాహ ఉధృతికి కొట్టుకుపోవడం పరిపాటిగా మారింది.

ఇనుప వంతెనతో సరిపెట్టిన అధికారులు

వాగుపై పూర్తిగా రాకపోకలు నిలిచిపోవడంతో స్థానికులు ఆందోళన చేపట్టారు. జూలై 2వ తేదీన మోకాటి లోతు వాగు నీళ్లలో నిలబడి రోడ్డు సౌకర్యం కల్పించాలని నిరసన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో వాగుపై సుమారు 15 లక్షల వ్యయంతో ఐరన్ పాత్ వే (ఇనుప వంతెన) నిర్మించారు. జూలైలో దీనిని నిర్మించినా, పది రోజుల వ్యవధిలోనే వరద ఉధృతికి కుంగిపోయింది. మరమ్మతులు చేసి, మరలా అందుబాటులోకి తెచ్చారు.

డైవర్షన్ లేక ఇబ్బందులెన్నో..

డైవర్షన్ రోడ్డు లేకపోవడం వల్ల తాళ్లపాయ (జీపీ కేంద్రం), రింగిరెడ్డిపల్లి, బూర్గువాయిగుంపు, ఊటచెరువు, కొమరంభీం నగర్, మంగలిగుట్ట, సుందర్‌నగర్ ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. పాదచారులు, ద్విచక్ర వాహనదారులు మాత్రమే ఐరన్ పాత్‌వే మీదుగా వెళ్లే వీలుంటుంది. ఈ క్రమంలో ములకలపల్లి నుంచి ఆయా గ్రామాలకు ఆటోలో వెళ్లే ప్రజలు వాగు వరకూ వెళ్లి, అక్కడ ఐరన్ బ్రిడ్జి దాటి మరో ఆటోలో ఇంటికి వెళ్లాల్సి వస్తోంది. దీంతో వారికి రెట్టింపు చార్జీలు చెల్లించాల్సి వస్తోంది. ఇక వాగు అవతల వ్యవసాయ భూములు ఉన్న రైతుల బాధలు వర్ణనాతీతం. వాగు వరకూ ఎరువుల బస్తాలు వాహనాల్లో తీసుకెళ్లి, ఇనుప వంతెనపై మోసుకుంటూ వాగు దాటాల్సి వస్తోంది. గత నాలుగు నెలలుగా ఇదే పరిస్థితి.

చేతికొచ్చిన పంటను తరలించేదెలా?

డైవర్షన్ వేస్తే వర్షాలకు కొట్టుకుపోతోందని అధికారులు మిన్నకుండిపోయారు. అయితే ప్రస్తుతం వర్షాలు తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో డైవర్షన్ రోడ్డు నిర్మాణం పట్ల దృష్టి సారించాలని ఆదివాసులు కోరుతున్నారు. పత్తి, వరి పంటలు చేతికొస్తున్న క్రమంలో వాటిని బయటికి తరలించేందుకు విధిగా రహదారి సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు. పలుమార్లు సమస్యను విన్నవించినా, స్పందించపోవడంతో అఖిలపక్ష పార్టీలతో కలసి ములకలపల్లిలో రాస్తారోకో చేసి నిరసన వ్యక్తం చేశారు. గిరిజనుల గోడు వినాలని, వెంటనే ప్రత్యామ్యాయ రోడ్డు వేయాలని అభ్యర్థిస్తున్నారు.

ఇలా ఎన్నాళ్లు..?



డైవర్షన్ రోడ్డు నిర్మించాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదు. ఇనుప వంతెన వేసి, చేతులు దులుపుకున్నారు. ట్రాక్టర్లు, ఆటోలు వంటి వాహనాలు వెళ్లే వీలులేకుండా పోయింది. అధికారులు ఇకనైనా దృష్టి సారించాలి.

– కొండ్రు సుందర్‌రావు, బూర్గువాయిగుంపు

యుద్ధ ప్రాతిపదికన పనులు



డైవర్షన్ రోడ్డు నిర్మాణం యుద్ధ ప్రాతిపదికన చేపడతాం. భారీ వర్షాల వల్ల ఇన్నాళ్లు ముందుకు సాగులేకపోయాం. ఇటీవల వర్షాలు కాస్త తగ్గుముఖం పట్టాయి. డైవర్షన్ రోడ్డుతోపాటు, నూతన బ్రిడ్జి నిర్మాణ పనులూ వీలేనంత త్వరలో పూర్తి చేస్తాం.

– సుబ్బరాజు, ఏఈ, ఐటీడీఏ

సామాన్యులకు చేరువగా ప్రభుత్వం



కరకగూడెం: కన్నాయిగూడెంలో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాయం

కరకగూడెం: ప్రజాపాలనతో సామాన్యుల దగ్గరికి చేరువైన ఏకైక ప్రజా ప్రభుత్వం తమదని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఆయన మంగళవారం మండలంలో విస్తృతంగా పర్యటించారు. తొలుత సుమారు 60 లక్షల అంచనా వ్యయంతో సమత్ భట్టుపల్లి, కన్నాయిగూడెం, భట్టుపల్లి గ్రామ పంచాయతీల్లో నిర్మించిన పలు సీసీ రోడ్లను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అలాగే పడిగాపురం, రేగళ్ల గ్రామాల్లో నూతన సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయా గ్రామ పంచాయతీల కార్యాలయ ఆవరణాల్లో అధికారులతో ప్రజల సమక్షంలో రివ్యూ సమావేశం నిర్వహించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతాయని, త్వరలోనే ఇందిరమ్మ ఇళ్లులు, రేషన్ కార్డులు, రైతు భరోసా వంటి పథకాలు అందుతాయని తెలిపారు. ఎవ్వరూ కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తేల్చిచెప్పారు. అధికారులు ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రామాల్లో పనిచేయాలని ఆదేశించారు. కార్యక్రమాల్లో మండల స్పెషల్ ఆఫీసర్ దినేష్, తహసీల్దార్ నాగ ప్రసాద్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్, మాజీ సర్పంచ్‌లు పోలేబోయిన తిరుపతయ్య, శ్రీవాణి, తోలెం నాగేశ్వరరావు, మండల నాయకులు ఎర్ర సురేష్, గొగ్గలి రవి, జలగం కృష్ణ, బుడుగుల మధు, వట్టం చుక్కయ్య, పూనెం బుచ్చయ్య, పడిగ సమ్మయ్య, మోడెపు సాంబయ్య, కరకపల్లి నగేష్, బిజ్జా రామనాథం తదితరులు పాల్గొన్నారు.

కుమురం భీం జయంతిలో..

మణుగూరుటౌన్: ఆదివాసీ ముద్దుబిడ్డ పోరాట సమరయోధుడు కొమరం భీం ఆశయాలను కొనసాగించాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. మంగళవారం కొమరం భీం జయంతి సందర్భంగా అంబేడ్కర్ చౌరస్తాలోని కొమరం భీం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు కాటబోయిన నాగేశ్వరరావు, యువజన నాయకులు కొర్సా ఆనంద్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పీరినాకి నవీన్, కాంగ్రెస్ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పార్టీని కాపాడుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అయోధ్య

మణుగూరురూరల్: త్యాగాలకు, పోరాటాలకు ఆజ్యం పోసింది భారత కమ్యూనిస్ట్ పార్టీ అని, ఈ పార్టీని కాపాడుకోవడం మనందరి బాధ్యత అని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొల్లోజు అయోధ్య అన్నారు. మంగళవారం మండల పరిధిలోని చిక్కుడుగుంట గ్రామంలో జరిగిన గ్రామశాఖ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సిపిఐ పోరాటం, అనేకమంది నాయకుల త్యాగాల ఫలితంగా ఈ ప్రాంతంలో అనేక గ్రామాలు ఏర్పడ్డాయని, రోడ్లు, కార్యాలయాలు, పాఠశాలలు వంటి సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయని గుర్తు చేశారు. డిసెంబర్ 26వ తేదీ నాటికి సీపీఐ ఆవిర్భవించి వంద వసంతాలు పూర్తి కావస్తున్న నేపథ్యంలో నిర్వహించనున్న మహసభలుశతజయంతి ఉత్సవాలకు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి సరెడ్డి పుల్లారెడ్డి, మండల కార్యదర్శి జంగం మోహన్‌రావు, రైతు సంఘం జిల్లా నాయకులు మంగి వీరయ్య, రామానుజవరం మాజీ సర్పంచ్ బాడిశ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక..

సీపీఐ చిక్కుడుగుంట గ్రామశాఖ నూతన కమిటీని ఈ సందర్భంగా ఎన్నుకున్నారు. శాఖ కార్యదర్శిగా బట్ట రామారావు, సహాయ కార్యదర్శిగా బట్ట సాంబయ్య, కోశాధికారిగా మేడ వెంకటేశ్వరరావు, గౌరవ అధ్యక్షుడిగా అలవాల సత్యంలతో పాటు 11 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ



లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు

భద్రాచలం: సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ లబ్ధిదారులకు మంగళవారం అందజేశారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక సాయానికై దరఖాస్తు చేసుకున్న పలువురికి ఈ సందర్భంగా ఆయన చెక్కులను అందజేసి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల నాయకులు రత్నం రమాకాంత్, అరికెల తిరుపతిరావు, భీమవరపు వెంకటరెడ్డి, గాడి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కరకగూడెం: మండల 33/11 కేవీ సబ్ స్టేషన్ వద్ద నేడు మరమ్మతుల చేపడుతున్న నేపథ్యంలో నేడు ఉదయం 09 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ కరకగూడెం ఏఈ నరేందర్ రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు తమకు సహకరించాలని కోరారు.

ఆదివాసీలపై కేసులు సరికాదు

ములకలపల్లి: తమ గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించాలని రాస్తారోకో చేపట్టిన ఆదివాసీపై అక్రమంగా కేసులు నమోదు చేయడం దారుణమని ఆదివాసీ జేఏసీ రాష్ట్ర నాయకుడు కుంజా రాజులు అన్నారు. ములకలపల్లిలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ సమస్య పరిష్కారం కోసం ప్రజాస్వామ్యయుతంగా నిరసన చేస్తున్న అమాయకులపై అక్రమంగా కేసులు బనాయించాలరని వాపోయాయి. ఉన్నతాధికారులు దృష్టి సారించాలని కోరారు. సంఘ నాయకులు పొడియం ప్రేమ్ కుమార్, మెచ్చా నాగేశ్వరరావు ఉన్నారు.

ఇసుక బిల్లులు చెల్లించాలి

మణుగూరుటౌన్: మున్సిపాలిటీలోని చినరావిగూడెం సొసైటీ ఇసుక బిల్లులు వెంటనే చెల్లించే విధంగా సంబంధిత అధికారులు తక్షణమే స్పందించాలని కోరుతూ.. మంగళవారం చినరావిగూడెం సమ్మక్క–సారక్క సొసైటీ సభ్యులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లకార్డులు చేతబట్టుకుని నినాదాలు చేశారు. సొసైటీ సభ్యులపై బెదిరింపులకు పాల్పడుతున్న రమేశ్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. తమ సొసైటీకి చెందిన ఇసుకను తమకే కేటాయించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు.

వర్గీకరణకు వ్యతిరేకంగా ఉద్యమించాలి

బూర్గంపాడు: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాలలందరూ ఐక్యంగా ఉద్యమించాలని జాతీయ మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు పూల రవీందర్ కోరారు. మోరంపల్లిబంజరలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా జాతీయ మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ ఆధ్వర్యంలో ఈ నెల 25 నుంచి చేపట్టనున్న మాలల మహాపాదయాత్రను జయప్రదం చేయాలని కోరారు. ఎస్సీ వర్గీకరణతో మాలలకు జరిగే అన్యాయాన్ని పాదయాత్రలో వివరించాలన్నారు. పాదయాత్రకు సంబంధించిన ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాల మహానాడు ప్రతినిధులు బొజ్జ ప్రసాద్, బర్ల బాబు, కుక్కల రామ్మూర్తి, బిల్లా రాము, సెనగ రాంబాబు, పాండు చిట్టిబాబు, శనగా అప్పారావు, తుమ్మల పున్నమ్మ, కుక్కల వెంకన్న, పిల్లి లాలయ్య పాల్గొన్నారు.

తహసీల్దార్‌ను సన్మానించిన పొదెం



తహసీల్దార్ అశోక్‌కుమార్‌ను సన్మానిస్తున్న పొదెం వీరయ్య

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం మండల తహసీల్దార్ యం.అశోక్‌కుమార్‌ను ఫారెస్ట్ డెవలప్మెంట్ స్టేట్ కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్య మంగళవారం సన్మానించారు. మండలంలోని ప్రధాన రహదారితోపాటు ఆంధ్ర ప్రాంతాలైన కన్నాయిగూడెం, సీతంపేట, చింతలగూడెం తదితర ప్రాంతాల్లోని ప్రధాన రహదారిపై గుంతలను తహసీల్దార్ అశోక్‌కుమార్ తన సొంత ఖర్చుతో తాత్కాలిక మరమ్మతులు చేయించారు. విషయం తెలుసుకున్న పొదెం వీరయ్య తహసీల్దార్‌ను క్యాంపు కార్యాలయంలో శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు చింతిర్యాల రవి కుమార్, టీపీసీసీ మెంబెర్ నల్లపు దుర్గా ప్రసాద్, దుమ్ముగూడెం మండల అధ్యక్షుడు వీరమాచినేని వినీల్, చర్ల మండల అధ్యక్షులు ఆవుల విజయ భాస్కర్ రెడ్డి, వెంకటాపురం మండల అధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్, వాజేడు మండల అధ్యక్షుడు దెనర్జన్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలకు నీళ్లు

- వాహనాలకు ఇష్టారాజ్యంగా నంబర్ ప్లేట్లు
- కొన్ని వాహనాలకు ప్లేట్లే లేవు..
- పట్టించుకోని రవాణాశాఖ అధికారులు

భద్రాచలంఅర్బన్: ద్విచక్ర వాహనదారులు నిబంధలను తుంగలో తొక్కుతున్నారు. వాహనాలకు వెనుక, మందు భాగంలో నంబర్ ప్లేట్లకు రవాణాశాఖ కేటాయించిన నంబర్లు కనిపించడం లేదు. వాటి స్థానంలో తమకు ఇష్టం వచ్చినట్లు సిక్కర్లను అతికించుకుంటున్నారు. నంబర్ ప్లేట్ లేని వాహనాలపై దర్జాగా తిరుగుతున్నా రవాణా, పోలీసు శాఖలు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నాయి. దీంతో వాహనదారులు ఆడిందే ఆట పాడిందే పాటగా మారింది.

ద్విచక్ర వాహనదారులు రవాణాశాఖ అధికారులు కేటాయించిన నంబర్లను ముందు, వెనుక భాగంలో ఏర్పాటు చేసుకోవాలి. వాటిని కూడా అనుమతించిన ఫాంట్, సైజులో మాత్రమే ఏర్పాటు చేసుకోవాలి. అయితే చాలా మంది ద్విచక్ర వాహనదారులు నంబర్ ప్లేటు ఏర్పాటు చేసుకోవడం లేదు. వాహనాలకు నంబర్ ప్లేట్‌పై ఒకటి, రెండు నంబర్లు మాత్రమే పెద్దవిగా మరో రెండు నెంబర్లతో పాటు సిరీస్‌ను కనిపించని చిన్నవిగా తయారు చేయించుకుంటున్నారు. ఇలాంటి వాహనాలను నడిపే వారి చేష్టలకు అడ్డు అదుపు లేకుండా పోతోంది. కొందరు వాహనాలకు నంబర్లు లేకుండా ప్రభుత్వ శాఖలకు సంబంధించిన ద్విచక్ర వాహనం కింద నంబర్ ప్లేట్లపై రాయించుకుంటున్నారు. ఆదర్శంగా ఉండాల్సిన ఉద్యోగులే నిబంధనలు ఉల్లంఘించడం విమర్శలకు తావిస్తోంది. దీంతోపాటు భద్రాచలం ప్రాంతం నాలుగు రాష్ట్రాలకు కేంద్ర బిందువుగా ఉంటుంది ఇక్కడ రోజు వందలాది ద్విచక్ర వాహనాల రాకపోకలు జరుగుతుంటాయి. నంబర్ ప్లేట్ లేని వాహనాలు ప్రమాదాలకు కారణమైతే నింధితులను పట్టుకోవడం కష్టమౌతుంది. రవాణా, పోలీసు అధికారులు ఇలాంటి వాహనాలపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు. కాగా, నెంబర్ ప్లేట్‌లు లేని వాహనాలను స్వాధీనం చేసుకుంటామని ట్రాఫిక్ ఎస్సై మధు ప్రసాద్ హెచ్చరించారు.



నంబర్ ప్లేట్ లేకుండా ఉన్న ద్విచక్ర వాహనాలు



నంబర్ ఉండాల్సిన ప్రదేశంలో పార్టీ పేరు ముద్రించిన వాహనదారుడు

చరిత్ర మరువని యోధుడు కుమురం భీం



దుమ్ముగూడెం: కుమురం భీం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తహసీల్దార్, సిబ్బంది



మణుగూరురూరల్: పూలమాల వేస్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు

మణుగూరురూరల్: మన్యం వీరుడు, ఆదివాసీ ముద్దుబిడ్డ కొమురం భీం అని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కొమరం భీం జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లోని భీం విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ పోశం నర్సింహరావు, సొసైటీ చైర్మన్ కుర్రి నాగేశ్వరరావు, బీఆర్ఎస్ నాయకులు వట్టం రాంబాబు, ఎడ్ల శ్రీనివాస్, అడపా అప్పారావు, సకిని బాబురావు, ముద్దంగుల కృష్ణ, బొలిశెట్టి నవీన్, లక్ష్మణ్, రాంబాబు, మహిళా నాయకులు, యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తుడుందెబ్బ ఆధ్వర్యంలో..

ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) ఆధ్వర్యంలో అంబేడ్కర్ సెంటర్‌లోని కుమురం భీం విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళ్లర్పించారు. అదే ప్రాంతంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు వట్టం నారాయణదొర, అల్లెం కోటి, వర్సా శ్రీనివాస్, ఆదివాసీ మహిళా నాయకులు, యువజన నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని నీటి పారుదల శాఖ కార్యాలయంలో మంగళవారం కొమరం భీం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నీటిపారుదల శాఖ జిల్లా కార్యదర్శి శ్యామల శ్రీనివాస్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాలుగో తరగతి ఉగ్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సాదిక్ భాషా, టీఎన్జీవో కార్యదర్శి గగ్గురి బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: కుమురం భీం జయంతి వేడుకలను ములకపాడు గ్రామం, తహసీల్దార్ కార్యాలయంలో వేరువేరుగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అశోక్‌కుమార్, ఆర్ఐలు కల్లూరి వెంకటేశ్వరరావు, నరసింహారావు, కార్యాలయ సిబ్బంది, ఆదివాసీ సంఘాల నాయకులు కొమరం దామోదరరావు, కుంజా శ్రీను, సోయం కామరాజు, తెల్లం హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మణుగూరురూరల్: కుమురం భీంకు నివాళులర్పిస్తున్న ఆదివాసీ నాయకులు



భద్రాచలంఅర్బన్: భీం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం